క్లుప్తంగా

ఎమ్మెల్సీ కవితను కలిసిన గౌతమ్



పుష్పగుచ్ఛం అందిస్తున్న గౌతమ్ శంకరయ్య

రామగిరి:తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్)గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోమవారం ఆసంఘం ఆర్జీ–3, ఏపీఏ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతమ్ శంకరయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా కేంద్రంలో టీబీజీకేఎస్ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు కవితను కలిసినట్లు తెలిపారు.

డ్రెయినేజీ వ్యవస్థను ఆధునీకరించాలి



పాదయాత్ర చేస్తున్న నాయకులు

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్‌లోని అడ్డగుంటపల్లి ఏరియాలో డ్రెయినేజీ వ్యవస్థ ఆధునీకరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అడ్డగుంటపల్లి సుందరయ్యనగర్, భరత్‌నగర్, చంద్రశేఖర్‌నగర్, ఎన్టీఆర్‌కాలనీ, ద్వారకనగర్, తిలక్‌నగర్ ఏరియాలో పాదయాత్ర నిర్వహించారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్య తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ పాదయాత్ర బృందం సభ్యులు మహేశ్వరి, లావణ్య, బిక్షపతి, కిషన్, చంద్రయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు,

క్రీడల్లో యువతను ప్రోత్సహిస్తాం

సుల్తానాబాద్ : క్రీడల్లో యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని కేసీఆర్ సేవా దళం జిల్లా ప్రధాన కార్యదర్శి బొద్దుల సాయినాథ్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మార్కండేయ కాలనీలో కూకట్ల మహేశ్ యాదవ్‌తో యువకులకు క్రికెట్ కిట్ పంపిణీ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొద్దుల లక్ష్మణ్ ఆదేశాల మేరకు కిట్ అందించినట్లు తెలిపారు.కార్యక్రమంలో కెసిఆర్ సేవా దళం నాయకులు వనపర్తి నాగరాజు, అవేటి గణేష్, చెల్ల దొరబాబు, రేకుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో పెయింటింగ్ పోటీలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జ్యోతినగర్: ఎన్టీపీసీలోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని జయించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు, వారిలో సృజనాత్మక ఆలోచన వ్యక్తీకరణలో విభిన్న ధోరణులు వెల్లడించేందుకు పెయింటింగ్ పోటీలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్ అన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్ట్ టీచర్ ప్రీతీ సాహు తదితరులు పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు చేసుకుంటున్న చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. పెద్దపల్లి పట్టణంలోని కూనారంరోడ్, భూంనగర్ లో సోమవారం నిర్వహించిన క్యాంపులో కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆమె వెంట కౌన్సిలర్ గీతాంజలి, నాయకులు వెంకటేశ్, మొబిన్, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీష్, తదితరులున్నారు.

నేడు కూడళ్లు ప్రారంభం

కోల్‌సిటీ: రామగుండం నగరంలో ఇటీవల అభివృద్ధి చేసిన రెండు ప్రధాన కూడళ్లను మంగళవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించనున్నారని నగర మేయర్ అనిల్‌కుమార్, కమిషనర్ బి.సుమన్‌రావు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక మండల సభ

- ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి
- అంతర్గత రహదారులు, నిర్మాణాలకు ప్రతిపాదనలు
- చెక్‌డ్యాంల మరమ్మతుకు నిధులు
- స్థానిక అవసరాలకు ఇసుక



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక మండల సర్వసభ్య సమావేశమని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ చార్ట్ ప్రదర్శించడంలేదని, ప్రభుత్వ స్కూళ్లలో కోడిగుడ్లు అందించడంలేదని, వ్యక్తిగత మరుగు దొడ్ల బిల్లులు రాలేదని, విద్యుత్ లైన్ల సమస్యలపై సర్పంచులు ఫోన్‌చేస్తే ట్రాన్స్‌కో అధికారులు స్పందించడంలేదని, పల్లెల్లో గుడుంబా విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, అనుబంధ గ్రామాల్లో రేషన్ షాపులు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, పందిల్ల గ్రామంలో మిషన్ భగీరథ టాంకులో తాగునీరుసరఫరా కావడంలేదని, కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో ట్రాన్స్‌కో లైన్‌మెన్ లేడని, గ్రామాల్లో లూజు లైన్లు సరిచేయడంలేదని, ప్రభుత్వ ఆస్పత్రిలో 30 పడకల సౌకర్యం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, మండల సమావేశానికి ఎస్సారెస్పీ అధికారులు రావడంలేదని సర్పంచులు సభా దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అంతర్గత రహదారులకు, వంతెనల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఆసరా పింఛన్లు సాంకేతిక కారణాలతో కొందరికి రాలేదని, త్వరలో అర్హులందరికీ వస్తాయని తెలిపారు.హుస్సేన్‌మియా వాగు స్థానిక అవసరాలకు ఇసుకను ప్రజలు వినియోగించుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణానికి కోటిన్నర నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వర్షాలతో కొట్టుకుపోయిన చెక్‌డ్యాంల మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, తహసీల్దార్ అనుపమ రావు, ఎంపీడీవో రామ్మోహనాచారి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేతాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి



సుభాష్‌చంద్రబోస్ వేషధారణలో విద్యార్థులు



నివాళి అర్పిస్తున్న సురేశ్ రెడ్డి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం, రామగుండం, గోదావరిఖని, సుల్తానాబాద్ పట్టణాలు మండల కేంద్రాలు, గ్రామాల్లో సుభాష్ చంద్రబోస్ విగ్రహాలకు , చిత్రపటాలకు నాయకులు, యువజన సంఘాల సభ్యులు, అధికారులు నివాళి అర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం పనిచేయాలని పలువురు వక్తలు కోరారు. కార్యక్రమాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

భవన నిర్మాణం కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

గోదావరిఖని: సీపీఐ తిరుపతి స్మారక భవన నిర్మాణం కోసం సోమవారం విరాళాలు సేకరణ చేపట్టారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణం కోసం విశేషంగా కృషి చేసిన సీపీఐ సీనియర్ నాయకుడు, పేద ప్రజలకు అనేక సేవలందించిన కామ్రేడ్ మార్కాపురి తిరుపతి(సీపీఐ తిరుపతి)స్మారక భవనం స్థానిక లాల్ బహదూర్‌నగర్‌లో నిర్మించనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, కనకరాజ్, తాళ్లపెల్లి మల్లయ్య, పడాల కనకరాజు, పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి వనరులను పెంచుకోవాలి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దాసరి

సుల్తానాబాద్‌రూరల్: మండల అభివృద్ధికి వనరులను పెంచుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించనున్న కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీరావు, మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, ఎంపీడీవో శశికళ, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సౌకర్యాల కల్పనకే ప్రాధాన్యం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని ప్రజలకు మెరుగైన వసతులను కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం వైకుంఠరథం, ల్యాడర్ వెహికిల్‌ను చైర్మన్ మమతారెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నాజ్మీన్‌సుల్తానా, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీష్ తదితరులున్నారు.

మన ఊరు మన బడితో పాఠశాలలకు మహర్దశ

ఓదెల: మనఊరు మనబడితో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓదెల మండలం పొత్కపల్లిలో రూ. 1.7 కోట్లతో పాఠశాల పక్కాభవనాల నిర్మాణానికి, రూ31లక్షలతో సీసీరోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. అనంతరం హైస్కూల్‌లో సరస్వతీ దేవీ విగ్రహం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి, సర్పంచ్ ఆళ్ల రాజిరెడ్డి, ఉప సర్పంచు వంగల శ్రీనివాస్, ఓదెల , రైతుసమన్వయసమితి చైర్మన్ కావటి రాజు, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, ఎంఈవో ఆరెపల్లి రాజన్న, పాఠశాల చైర్మన్ మాచర్ల మౌనిక, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండాలను డ్రెయినేజీల్లో వేస్తారా..?



వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థను పరిహాసం చేసేలా బీఆర్ఎస్ నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, అందుకు మున్సిపల్ అధికారులు సహకరిస్తున్నారని పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు బి. సురేశ్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ నేతలు వార్డుల్లో చేపట్టే కార్యక్రమాల సందర్భంగా ఏర్పాటు చేసిన జెండాలను తొలగించి డ్రెయినేజీల్లో పడేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కౌన్సిలర్లు సుభాష్‌రావు, సంపత్ మేనేజర్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. జెండాలను మురుగుకాలువల్లో పడేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీశారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆధ్వర్యంలో గడపగడప కు కాంగ్రెస్ పేరిట ప్రజాసమస్యలను తెలుసుకుంటుంటే అది జీర్ణించుకోలేని అధికార పార్టీ నాయకులు కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కాండం తొలిచే పురుగును నివారించాలి



కమ్మరిఖాన్‌పేటలో పొలాన్ని సందర్శించిన ఏవో

ధర్మారం: వరి సాగు చేసిన రైతులు ప్రస్తుత దశలో వరికి కాండం తొలుచు పురుగులు, రెక్కల పురుగుల గుడ్ల సముదాయాలను గమనించి మందులను పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ అన్నారు. మండలంలోని కమ్మరిఖాన్‌పేటలోని వరిపొలాలను సోమవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా వరిపొలాలకు ఆశించిన రోగాలను గమనించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కాండం తొలుచు పురుగుల ఉధృతిని తగ్గించేందుకు లింగాకర్షణ బుట్టలను అమర్చుకుని రెక్కల పురుగులపై నిఘా పెట్టాలన్నారు. గుళికల మందులను వాడుతే ఖర్చుపెరుగుతుందని వీటికి బదులుగా ఎకరాకు 800 గ్రాములు లేదా కిలో కార్బోఫ్యురాన్ గుళికలను వేయాలన్నారు. రైతులు వరిపైరును ఎప్పటికప్పుడు గమనిస్తూ ఏలాంటి రోగాలు వచ్చిన అధికారులకు సమాచారం ఇస్తే తగు మందులను సూచిస్తామన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ వేడుకలు



వాసవీమాతకు పూలమాలవేస్తున్న వైశ్యులు



కాల్వశ్రీరాంపూర్‌లో మహిళల పూజలు

సుల్తానాబాద్ /ధర్మారం/కాల్వశ్రీరాంపూర్: వాసవీమాత ఆత్మర్పాణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మారం మండల కేంద్రంలోని వైశ్యభవనంలో, కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో సుల్తానాబాద్ పట్టణంలో సోమవారం ఘనంగా వేడుకలను నిర్వహించారు. వాసవీమాత విగ్రహానికి పూలమాలవేసి క్షీరాభిషేకం చేశారు. మహిళలు అమ్మవారికి చీరెసారెలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ధర్మపురి దేవస్థానం డైరెక్టర్ జైన రాజమౌళి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అశోక్, వాసవి క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ ఎల్లంకి రాజన్న ,జోన్ చైర్మన్ అల్లంకి లింగమూర్తి , పట్టణ ఆర్యవైశ్య గౌరవాధ్యక్షులు కొమురవెల్లి రామ్మూర్తి, పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

కాల్వశ్రీరాంపూర్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 81 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణ లక్ష్మీ చెక్కులను అందించారు. కళ్యాణలక్ష్మి కార్యక్రమంలో అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పాతది కూల్చరు.. కొత్తది కట్టరు!

- శిథిలావస్థలో బాలికల జూనియర్ కళాశాల
- ఆరేళ్ల క్రితమే కూల్చాలని నిర్ణయం
- ఇప్పటి వరకు కూల్చని వైనం
- 3 గదుల్లో 300 మంది విద్యార్థినులు



శిథిలావస్థకు చేరుకున్న పెద్దపల్లి బాలికల జూనియర్ కాలేజీ భవనం

పెద్దపల్లిరూరల్: విద్యారంగానికి ప్రాధాన్యత నిస్తున్నామంటున్న ప్రభుత్వ పాలకుల మాట జిల్లా కేంద్రం పెద్దపల్లిలో చెల్లు బాటు కావడం లేదు. అభివృద్ధి పనులు చేపడతామని వారు ఇచ్చిన హామీలు నీటి మూటలే అయ్యాయి. పెద్దపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరింది. శిథిలమైన జూనియర్ కళాశాల భవనాన్ని కూల్చాలని ఆరేళ్ల క్రితం అధికార యంత్రాంగం నిర్ణయించింది. అయినా ఇప్పటి వరకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు ఈ భవనాన్ని కూల్చే పనులను ఇంకా చేపట్టడం లేదు.

అందుబాటులో ఐదుకోర్సులు..

ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్‌కాలేజీ లో ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులతో పాటు ఎంపీహెచ్‌డబ్ల్యూ (బాలికలు) వొకేషనల్ కోర్సులున్నాయి. ఈ కోర్సుల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన సాగుతోంది. ఆయా కోర్సుల్లో దాదాపు 300 మంది విద్యార్థినులున్నారు. ప్రస్తుతమున్న మూడు గదులు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇదే ఆవరణలోని బాలుర కాలేజీ కి చెందిన లాబొరేటరీ గదులను కూడా విద్యాబోధనకు వినియోగిస్తున్నారు.

అనుమతులు వచ్చినా.. పనులు చేపట్టడం లేదు..

శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని కూల్చేందుకు అనుమతి వచ్చినా.. ఇంకా ఆ భవనాన్ని కూలచ్చడం లేదు. శిథిల భవనాన్ని కూల్చి అదే స్థానంలో కొత్త భవనం నిర్మించి విద్యార్థినుల ఇబ్బందులను దూరం చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. జిల్లా కేంద్రం పెద్దపల్లిలో జూనియర్ కాలేజీ నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులను మంజూరు చేసి పనులు చేపట్టాలంటున్నారు. ఇందుకు స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చొరవ చూపి కళాశాలకు కొత్త భవనం నిర్మించేందుకు కృషి చేయాలని విద్యార్థినులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



తరగతి గదులు లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. పాత భవనం కూలుతుందనే భయంతో ఖాళీ చేయించారు. దాన్ని కూల్చి కొత్త భవనం కట్టిస్తే మా ఇబ్బందులు దూరమవుతాయి. భయం భయంగా చదువులు కొనసాగిస్తున్నాం.

– రుషిత, సీఈసీ విద్యార్థిని

కొత్త భవనం కట్టించాలి



బాలికలకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎంతో అనువుగా ఉంది. ఈ కాలేజీ పాత భవనాన్ని కూలగొట్టించి వీలైనంత తొందరగా కొత్త భవనాన్ని నిర్మిస్తే ఈ ప్రాంతంలోని బాలికలకు ఎంతో మేలు కలుగుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

– దేవిక, హెచ్ఈసీ విద్యార్థిని

అధికారులకు నివేదించాం



ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి ఖాళీ చేశాం. కూల్చేందుకు అనుమతినిచ్చారు. ఇంకా ఆ పనులు కాలేదు. కొత్త భవనం మంజూరైతే విద్యార్థినులకు సౌకర్యంగా ఉంటుంది.

– మైత్రేయి, ప్రిన్సిపాల్

నేడు జూలపల్లి మండల సర్వసభ్య సమావేశం

జూలపల్లి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నేడు ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల రావు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరవుతున్నారని, సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు టై,బెల్టులు అందజేత

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తుల వెంకటమ్మ జ్ఞాపకార్థం రిటైర్డ్ ఉపాధ్యాయుడు సరళా వెంకటేశ్వరరావు రూ.5 వేల విలువ గల టై, బెల్టులను సర్పంచ్ జమున చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం.పద్మ, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రామగిరి: కమాన్‌పూర్ మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1980–81లో పదోతరగతి కలిసి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. మండలంలోని కల్వచర్ల పంచాయతీ పరిధిలోని శ్రీలక్ష్మిగార్డెన్స్‌లో పూర్వవిద్యార్థులు సకుటుంబ సమ్మేళనం నిర్వహించుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 42 ఏళ్ల క్రితం విడిపోయిన విద్యార్థులు ఒకేచోట కలిసి యోగ క్షేమాలు తెలుసుకుని సంతోషంతో గడిపారు. వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సముద్రాల వేణుగోపాలాచారి, సయ్యద్ ఇక్బాల్, రెండ్ల తిరుపతి, మల్యాల రమేశ్‌గౌడ్, దాసం సురేందర్, ఎం.రామ్మూర్తి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

‘ఓట్ల కోసమే కంటి వెలుగు’

కమాన్‌పూర్: ‘కంటి వెలుగు’ కేవలం ఓట్ల కోసమేనని కాంగ్రెస్ పార్టీజిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. కంటి వెలుగులో 18 ఏళ్ల లోపు ఉన్న యువతీ, యువకులకు పరీక్షలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వృద్ధులకు మొక్కుబడిగా పరీక్షలు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మాల్యాల తిరుపతి, చంద్రమౌళి, నాయకులు పాల్గొన్నారు.

5,534 మందికి కంటి పరీక్షలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో సోమవారం 5,534 మందికి కంటివైద్య పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. 1,676 మందికి లోపాలున్నట్లు గుర్తించి, 864 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో 756 మందికి అవసరమైన అద్దాలను తెప్పించి ఇస్తామన్నారు. 598 మందికి మెరుగైన వైద్యసేవల కోసం సిఫారసు చేసినట్లు వివరించారు.

రోగులకు సామాన్య వైద్యాన్ని మాత్రమే అందించాలి

- ఆర్ఎంపీల సంఘం కార్యవర్గం ఎన్నిక

రామగుండం: రోగులకు సామాన్యమైన వైద్యాన్ని మాత్రమే అందించాలని, తెలిసీ తెలియని ఆరోగ్య విషయాలపై రోగుల బంధువులను అయోమయానికి గురి చేయవద్దని, తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అంతర్గాం మండల అధ్యక్షుడు అల్లనేరడి కనకయ్య అన్నారు. సోమవారం అంతర్గాం మండల కేంద్రంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా అల్లనేరడి కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా బుట్టి రాజయ్య, కోశాధికారిగాయాదగిరిగౌడ్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్‌డీ.అజీజ్, అధ్యక్షుడు కొంకటి శ్రీనివాస్, సలహాదారు రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ముస్తఫా, అధికార ప్రతినిధి శంకర్, ధర్మారం మండల అధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.